క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

కౌటాల: గ్రామ పంచాయతీ సిబ్బంది వేతన బకాయిలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండలంలోని పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల వేతనాలను గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లించాలని, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలన్నారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, జీవో 51ని సవరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మోరేశ్వర్, నగేశ్, రాజారం, ప్రకాశ్, కార్మికులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



బాబును కుటుంబీకులకు అప్పగిస్తున్న సిబ్బంది

దహెగాం: మండలంలోని పీపీరావు కాలనీకి చెందిన సిడాం అంజమ్మకు శుక్రవారం పురిటి నొప్పులు రాగా కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. ఆమెను 108 బెల్లంపల్లి ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మంచిర్యాల జిల్లా ఎల్లారం సమీపంలో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ సుధాకర్, పైలెట్ సాయికిరణ్ తెలిపారు. వారిని బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో

లింగాపూర్: మండలంలోని పిక్లాతండా, కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎఫ్ఆర్‌వో జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవుల రక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు అనూష, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

'అమిత్‌షా రాజీనామా చేయాలి'



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇచ్చోడ: కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం మండల కేంద్రంలోని సిరిచెల్మ చౌరస్తా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఆయన రాసిన రాజ్యాంగం వల్లే పదవులు అనభవిస్తున్న నాయకులు అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్నెల లక్ష్మణ్, మహిముద్‌ఖాన్, ముస్తాఫా, దమ్మపాల్, కొత్తురి లక్ష్మణ్, మోహరాజ్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బోరిగాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సందీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోని చెట్ల పొదల్లోని రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి నిందితులను పట్టుకున్నామన్నారు. రూ.5,500 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం

- పాత కూరగాయల మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్త
- ప్రారంభం కాని షాపింగ్ కాంప్లెక్స్ పనులు



పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని పాత కూరగాయల మార్కెట్ స్థలం ఖాళీగా ఉండడంతో చుట్టూ పక్కల వారు ఇక్కడే చెత్తాచెదారం పడేస్తున్నారు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈగలు దోమలు విజృంభించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. దానితో పాటు జిల్లా కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక పోవడంతో చుట్టు పక్క షాపుల్లో పని చేసే వారు ఖాళీ స్థలంలోనే పని కానిస్తున్నారు. గతంలో ఉన్న కూరగాయల మార్కెట్ తరలించి రెండు సంవత్సరాలు గడుస్తుంది. షాపింగ్ మాల్ నిర్మాణం కోసం గతంలో ఉన్న షెడ్లను తొలగించి ఏళ్లు గడుస్తున్నా.. నేటి వరకు ఖాళీగానే దర్శనమిస్తోంది.

పిచ్చి మొక్కలు..

జిల్లా కేంద్రంలోని బాపునగర్, కాసబ్‌వాడీ, సందీప్ నగర్, రాజేంపేట్, టీఆర్‌నగర్ తో పాటు చాలా చోట ఖాళీ ప్లాట్‌లలో పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయి. రాత్రి వెళలో చెట్లల నుంచి విష పురుగులు ఇంట్లోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పెరిగిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలి..

పాత కూరగాయల మార్కెట్‌ను జూబ్లీ మార్కెట్‌కు తరలించడంతో గత రెండు సంవత్సరాల నుంచి పాత కూరగాయల మార్కెట్ స్థలం ఖాళీగా ఉంది. దీంతో అక్కడే చెత్తాచెదారం పడేస్తున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం పాత షెడ్లు తొలగించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా.. నేటికి పనులు ప్రారంభం కాలేదు. పాత కూరగాయల మార్కెట్ స్థలం షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీంతో చాలా మంది ఉపాధి పొందే అవకాశం ఉంటుంది.

కనీస వేతనాలు పెంచాలని ధర్నా

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 అమలు చేసి కనీస వేతనాలు పెంచాలని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించిన అనంతరం పీవో నరేందర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణిలో పర్మినెంట్ కార్మికుల సంఖ్యతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తూ బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అయినా యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను కట్టుబానిసలుగా చూస్తూ వివక్షతత చూపుతుందని ఆరోపించారు. కోలిండియా వేతనాల అమలు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు వైద్యసదుపాయం కల్పించడం, క్యాంటీన్ సౌకర్యం, పండగలకు జాతీయ సెలవులు, వృత్తి పన్ను మినహాయింపు, కేటగిరీల ఆధారంగా వేతనాలు, మైన్స్ చట్టం, కాంట్రాక్టు లైబర్ చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించటంలో వివక్షత కొనసాగుతుందని స్పష్టం చేశారు. రెండేళ్ల క్రితం జరిగిన ఒప్పందం ప్రకారం జీవో 22 ప్రకారం కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మొండి వైఖరి వీడని పక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె 18వ రోజుకు చేరుకుంది. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కోట్నాక విజయ్ సంఘీభావం తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ప్రస్తుతం సీఎంగా ఉన్నందున సమస్యలు పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. కేజీబీవీల్లో విద్యా బోధన లేక విద్యార్థులు నష్ట పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేష్, రమాదేవి, ధర్మయ్య, ఆనంద్ రావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామ పంచాయతీల్లో ఏళ్లుగా పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే టోకెన్ సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీవో 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్‌కు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం జేఏసీతో చర్చలు జరపాలని కోరారు. మల్టీపర్పస్ విధానంతో కార్మికులపై పని ఒత్తిడి పెరిగిందని అన్నారు. ఇతర పనులపై నైపుణ్యం లేక కార్మికులు ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, పాత పద్ధతిలోనే విధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో జేఏసీ నాయకులు సుధాకర్, రమేశ్, వెంకటేశ్, దేవాజీ, ప్రవీణ్, శంకర్, శ్రీనివాస్, లక్ష్మి, కార్మికులు రాజమ్మ, రాజేశ్వరి, లక్ష్మి, పద్మ, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్న ఉపేందర్

పరిహారం చెక్కులు అందజేత

సిర్పూర్(టి): చిరుతపులి దాడిలో రెండు పశువులు మరణించగా, బాధిత రైతులకు మంజూరైన నష్ట పరిహారం చెక్కులను శుక్రవారం సిర్పూర్(టి) రేంజ్ అధికారి ఇక్బాల్ హుస్సేన్ అందించారు. మండలంలోని శివపూర్‌కు చెందిన దండిక శ్రీనివాస్‌కు రూ.16వేలు, ఎనోన్కార్ భావూజీకి రూ.15వేల విలువైన చెక్కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీధరాచారి, ఎఫ్‌బీవో హబీబ్ పాల్గొన్నారు. అలాగే కాగజ్‌నగర్ మండలం చిన్న మాలిని గ్రామానికి చెందిన మడావి సాగర్, సిర్పూర్(టి) మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన భీంరావ్‌ల పశువులు చిరుత, పెద్దపులి దాడిలో మృతి చెందగా బీట్ అధికారులు అరుణ్‌రెడ్డి, అరవింద్‌లు యజమానులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున పరిహారం అందించారు.



చెక్కు ఇస్తున్న ఎఫ్ఆర్‌వో ఇక్బాల్ హుస్సేన్

'ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం'

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.పసుల రాంమూర్తి అన్నారు. పెంచికల్‌పేట్, కొండపల్లి గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఎల్కపల్లిలోని డా.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు నీల్ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చిందన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాతను కించపరిచేలా మాట్లాడిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం మాలమహానాడు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పల్లెం పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా రత్నం సుధాకర్, నాగరాజు, కార్యదర్శి మేకల హన్మంతును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు ముత్తముల పుల్లయ్య, జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాగల కిష్టయ్య, పురుషోత్తం, కార్యదర్శి దేవనపల్లి మధుబాబు, జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంమూర్తి

వైభవంగా అయ్యప్ప శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి శోభాయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్‌సిల్క్ కాలనీలోని రాంమందిర్ నుంచి ప్రారంభమైన ఈ శోభయాత్ర రాజీవ్ గాంధీ చౌక్, మెయిన్ మార్కెట్‌తో పాటు పలు వీధుల గుండా కొనసాగి అయ్యప్ప స్వామి దేవాలయానికి చేరుకుంది. మహిళలు మంగళహారతులతో ర్యాలీ నిర్వహించారు.

కానరాని ఏటీఎం..!

- నగదు విత్‌డ్రాకు ఇబ్బందులు
- ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించి నష్టపోతున్న ఖాతాదారులు



లింగాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు

లింగాపూర్: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా, పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుంది. తాజాగా రైతుభరోసా, రైతు రుణమాఫీ, పింఛన్ డబ్బులు, ఉపాధి హామీ పథకాల డబ్బును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాయి. కానీ నగదు విత్‌డ్రా, చేసేందుకు రెండు మండలాల్లో ఒక్క ఏటీఎం సెంటర్ లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకు ఎదుట రోజంతా నిరీక్షిస్తున్నామని వాపోతున్నారు. లింగాపూర్ మండలంలో 14 గ్రామ పంచాయతీలు, సిర్పూర్ (యూ)లో 16 గ్రామ పయతీలు ఉన్నాయి. వాటిలో 20 వేలకుపైగా ఖాతాదారులున్నారు. ఈ రెండు మండలాల్లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు మాత్రమే ఉంది. అయితే ఏటీఎం లేకపోవడంతో ఉట్నూర్ కేంద్రానికి వెళ్తున్నారు.

ఏటీఎం ఏర్పాటు చేయాలి



సిర్పూర్(యూ), లింగాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద కూడా ఏటీఎం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. బ్యాంకు మూసి ఉన్న సమయంలో, నగదు విత్‌డ్రా చేసేందుకు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తున్నాం. మండలంలో ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలి.

– ఆనంద్‌ఈశ్వర్, లింగాపూర్ (గుమ్నూర్)

ఆధార్ కార్డుతోనే విత్‌డ్రా..

సిర్పూర్ (యూ), లింగాపూర్ మండల కేంద్రంలో ఏటీఎం లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఖాతాదారుల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు, ఆధార్ బయోమెట్రిక్, వేలిముద్ర ఆధారంగా నగదు విత్‌డ్రా చేస్తున్నారు. దీంతో ఖాతాదారుల నుంచి కమీషన్ తీసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులకు తెలియకుండా తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి మండల కేంద్రంలో ఏటీఎం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



రెబ్బెన: పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



వాంకిడి: నివాళులర్పిస్తున్న సుగుణ, నాయకులు



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న అర్షద్ హుస్సేన్

కాగజ్‌నగర్ రూరల్: దేశ ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పిన గొప్ప ఆర్థికవేత్త, ఆధునిక భారతదేశ రూపకర్త మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆయన నివాసంలో మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు సిడాం గణపతి, షబ్బీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

- దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో ఆయన నివాసంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరుణ్, దెబ్బటి శ్రీనివాస్, బాల్క శ్యాం, మురళీధర్‌రావు, కొప్పుల శంకర్, నీరటి సత్యనారాయణ, శివ, నారాయణ పాల్గొన్నారు.

రెబ్బెన: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి శుక్రవారం కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1991లో ఆర్థిక శాఖ మంత్రిగా పని చేసిన మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో లావుడ్య రమేశ్, దేవాజీ, దుర్గం సోమయ్య, మురళీ, గంటుమేర, కొవ్వూరి శ్రీనివాస్, చిరంజీవిగౌడ్, కిషన్‌గౌడ్, రవీందర్ పాల్గొన్నారు.

వాంకిడి: దేశ ప్రధానిగా ఎనలేని సేవలందించిన మన్మోహన్ సింగ్ మరణం పార్టీకి తీరని లోటని పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఎనలేని సేవలందించిన మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, పట్టణ అధ్యక్షుడు అనిల్, దాదాజీ, సుధాకర్, గణేష్, హన్మంతు, జైరామ్, సునీల్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ రూరల్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూర్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మారువలేనివని టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్కారి రమేశ్, ఉమ్మరి లింగయ్య, రంగు సురేశ్‌గౌడ్, జంగిటి సత్యనారాయణ, జలపతి, జంగిటి మల్లేష్, సల్మాన్ ఖాన్, ఇగురపు వెంకటేశ్, గుమ్ముల శ్రీనివాస్, కుమ్మరి పోశం పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌అర్బన్: మన అమ్మ.. మన సారె కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉపేంద్రచారి ప్రత్యేక పూజలు చేశారు. మొదట మన అమ్మ మన సారెను పురస్కరించుకొని గోవిందమాంబ సమేత వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో గాయత్రిమాతకు అభిషేకం, అమ్మవారికి కుంకుమాభిషేకం, అనంతరం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సారెను కానుకగా సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.